ఆర్ అండ్ బీ రోడ్డుపై అగచాట్లు

- జేమ్స్‌పేట- చినగొన్నూరు ఆర్ అండ్‌బీ రోడ్డు దుస్థితి
- కోతకు గురైన రోడ్డు
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు

గుడ్లవల్లేరు: ప్రధాన రహదారుల్లో ప్రయాణంలో వాహన చోదకులకు అగచాట్లు తప్పటం లేదు. జేమ్స్‌పేట నుంచి చినగొన్నూరు వెళ్లే ఆర్ అండ్‌బీ రహదారి పూర్తిగా కోతకు గురైంది. అడుగడుగునా గోతులు, గతుకుల మయంగా మారింది. ఈ రోడ్డులోని కొన్ని చోట్ల కాలి నడక కూడా ఇబ్బందిగా మారింది.

ఆరు గ్రామాలపై ప్రభావం..

దీంతో జేమ్స్‌పేట, చింతలగుంట, తాడిచెర్ల, పురిటిపాడు, కట్టవానిచెరువు, చినగొన్నూరు గ్రామాల ప్రజలు రాకపోకల్లో పడరాని పాట్లు పడుతున్నారు. రోడ్లు పూర్తిగా పాడైపోయిన కారణంగా రాత్రి వేళల్లో ఆ గోతుల్లో పడిపోయిన వాహన చోదకులు తీవ్ర గాయాల పాలవుతున్నారు. ప్రమాదాలకు గురై గాయాల పాలైనా.. తమను పట్టించుకునే నాధులే కరువైపోయారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఈ రోడ్డును నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


రోడ్డు మధ్య నుంచి కుంగిపోయి..ఇలా


కోతకు గురైన రోడ్డు

రోడ్డు ప్రాధాన్యత ఇదీ..

గుడివాడ, బందరు, ముదినేపల్లి తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ ప్రాంత ప్రజలకు ఇది ప్రాధాన్యత కలిగిన రోడ్డు. ఈ రోడ్డు అస్తవ్యస్తంగా ఉండటంతో రాకపోకలకు ప్రజలు ఎప్పుడు, ఏ ప్రమాదం జరుగుతుందోనని టెన్షన్‌కు గురవుతున్నారు. గుంతలు లేని రోడ్లను తయారు చేస్తామని ప్రస్తుత ప్రభుత్వం చెబుతున్న మాటలు నీటి మూటలుగా మిగిలిపోయాయని ప్రజలు విమర్శిస్తున్నారు.

మా రోడ్డును వెంటనే నిర్మించాలి..

మా రోడ్డును కూటమి ప్రభుత్వం వెంటనే నిర్మాణం చేయాలి. రోడ్డు పూర్తిగా మరమ్మతులకు గురైంది. కానీ పట్టించుకునే నాధులే లేకుండా పోయారు. అధికారంలోకి వచ్చాక అన్ని రహదారులను నిర్మిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇపుడు ఎందుకు నిర్మాణం చేయటం లేదు?

– మక్కు సోమేశ్వరరావు, శేరీ దగ్గుమిల్లి ఎంపీటీసీ సభ్యుడు



రోడ్ల పనుల్లో రాష్ట్ర ప్రభుత్వ వాటా ఎంత?

కనీసం గ్రామాల్లో మరమ్మతులకు గురైన ఇలాంటి రోడ్లను అయినా కూటమి ప్రభుత్వం నిర్మించాలి. పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో కూటమి ప్రభుత్వ నిధుల వాటా ఎంత?. ఆ రోడ్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్మించటం లేదు. కేవలం కేంద్రం నిధులతో పనులు చేస్తున్నారు.

– పిడుగు దేవసహాయం, సీపీఎం గుడ్లవల్లేరు మండల నాయకుడు



కొల్లేరు ఆక్రమణ తీర్పుపై స్పందించాలి

మండవల్లి: సుప్రీంకోర్టు కొల్లేరు ఆక్రమణలపై ఇచ్చిన తీర్పుపై కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి కొల్లేరు ప్రజల తరపునల ఇంప్లీడ్ పిల్ వేసి వాదనలు వినిపించాలని జనసేన నాయకులు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని మణుగునూరులో శుక్రవారం పెదయెడ్లగాడి నందు ఎమ్మెల్సీ మాట్లాడారు. ఈ నెల 16న సుప్రీంకోర్టు కొల్లేరులో ఆక్రమణలను మూడు నెలల్లోగా తొలగించాలని ఏపీ ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేసిందని తెలిపారు. 2006 ఆపరేషన్‌లో 77 వేల 138 ఎకరాలు అటవీ, రెవెన్యూ శాఖలు సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ధ్వంసం చేశారని పేర్కొన్నారు. 77వేల 138 ఎకరాలే కాక అదనంగా 13 వేల ఎకరాలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. 2018లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలో నేషనల్ వైల్డ్‌లైఫ్ బోర్డు స్పందించి 77 వేల 138 ఎకరాల నుంచి 15 వేల ఎకరాల జిరాయితీ భూమిని, 7 వేల ఎకరాల డీఫామ్ పట్టాలను మొత్తం 22 వేల ఎకరాలను మినహాయించాలని తీర్మానం చేసి సీఈసీ కమిటీకి పంపగా వారు అప్పటి రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ ఇవ్వాలని కోరారన్నారు. దీనిపై ఇంప్లీడ్ పిల్ వేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి సుప్రీంకోర్టు తీర్పుపై ఇంప్లీడ్ పిటీషన్ వేసి, మా కొల్లేరు ప్రజల తరపున వాదన వినిపించాలని కోరారు.


కొల్లేరు తీరును వివరిస్తున్న ఎమ్మెల్సీ వెంకటరమణ

పిరమిడ్ ధ్యానకేంద్రం పనులు ప్రారంభం

తోట్లవల్లూరు: ధ్యానంతో మానసిక ప్రశాంతతో పాటు మంచి ఆరోగ్యం లభిస్తుందని నేషనల్ వెజిటేరియన్ మూమెంట్ అధ్యక్షుడు, మహేశ్వర మహా పిరమిడ్ (కడ్తాల్) అడిషనల్ ట్రస్టీ వల్లూరు శివనాగకృష్ణ తెలియజేశారు. మండలంలోని బొడ్డపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంపై రూ.3 లక్షల వ్యయంతో నిర్మించనున్న పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ మూడే శివశంకరరావుతోపాటు కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ప్రతిఒక్కరూ శాకాహారం తీసుకుని, పిరమిడ్ శక్తిని పొంది ఆరోగ్యం, ఆనందం పొందాలని శివనాగకృష్ణ సూచించారు. సర్పంచ్ శివశంకరరావు మాట్లాడుతూ నూతనంగా నిర్మించనున్న పిరమిడ్ ధ్యానకేంద్రాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉప సర్పంచ్ కె.శివశంకర్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వీఆర్‌ఓ నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు శీలం మధుబాబు, ఎస్.శివరామకృష్ణ, ఎస్.జయరాం, బి.వెంకటరామయ్య, జే.నాగేశ్వరరావు, శ్రీనివాసమూర్తి, చిట్టిబాబు, చినబాబు, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శివనాగకృష్ణ, పక్కన సర్పంచి

సమాచార హక్కు చట్టం బోర్డుల ఏర్పాటు


సచివాలయంలో స.హ.చట్టం బోర్డును ఏర్పాటు చేయిస్తున్న కార్యదర్శి నరసింహారావు, సిబ్బంది


స్త్రీ శక్తి భవనంలో బోర్డును ఏర్పాటు చేసిన ఏపీఎం మహంకాళరావు

గుడ్లవల్లేరు: ఎట్టకేలకు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేయాల్సిన అధికారుల వివరాలు తెలిపే బోర్డులను ఆయా శాఖల అధికారులు ఏర్పాటు చేశారు. శుక్రవారం 'సమాచార హక్కు చట్టంపై చిన్నచూపు' అనే శీర్షికన 'సాక్షి'దినపత్రికలో శుక్రవారం కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి వెంటనే స్పందించిన గుడ్లవల్లేరు గ్రామ కార్యదర్శి ఎ.జె.ఎల్.నరసింహారావు తమ సిబ్బందితో కలిసి గ్రామ సచివాలయంలో సమాచార బోర్డును ఏర్పాటు చేశారు. అలాగే గుడ్లవల్లేరులోని స్త్రీ శక్తి భవనంలో ఏపీఎం సీహెచ్. మహంకాళరావు సమాచార బోర్డును తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. త్వరలో ఈ తాత్కాలిక బోర్డుల స్థానే శాశ్వత బోర్డులను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశామని నరసింహారావు, మహంకాళరావు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్

20 నుంచి పశు వైద్య శిబిరాలు

కైకలూరు: పశు వైద్య శిబిరాలను కైకలూరు, కలిదిండి మండలాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తామని పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ పఠాన్ మస్తాన్ ఖాన్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 26 రిపబ్లిక్ డే మినహాయించి అన్ని రోజులు అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. వ్యాధుల నివారణ సూచనలతో పాటు వాక్సిన్లు ఉచితంగా అందిస్తామన్నారు. డాక్టర్లు ఎ.ఫణీంద్రబాబు, ఎ.ప్రహర్షల ఆధ్వర్యంలో సిబ్బంది శిబిరాల్లో పాల్గొంటారని చెప్పారు.

• బండెనక బండి కట్టి..


ప్రకృతి వైపరీత్యాలను అధిగమించి.. చీడపీడలను తట్టుకుని.. ఎట్టకేలకు ధాన్యం సిరులు గూటికి చేరుతున్నాయి. అరకొరగా చేతికి వచ్చిన ధాన్యపు సిరుల్ని బండి ఎనక బండి కట్టి.. ఇంటికి తీసుకెళ్తున్నారు రైతన్నలు. ఆరుగాలం కష్టించి పంటను కంటికి రెప్పలా కాపాడుకున్న రైతులు ధాన్యం బస్తాల్ని తీసుకెళ్తున్న ఈ ఎడ్లబళ్ల దృశ్యం తెలుగు సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తోంది. రైతుల మోముల్లో చిరుదరహాసం నింపుతోంది. – గుడ్లవల్లేరు

అన్నక్యాంటీన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

పామర్రు: గ్రామంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పరిశీలించారు. స్థానిక అధికారులతో కలిసి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పథకాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటుమన్నారు. తొలుత మండల కేంద్రమైన పామర్రులో ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి టీ నరేష్, పార్టీ నాయకులు వల్లూరిపల్లి గణేష్, పరసా సుబ్రమణ్యం, వీ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ రవికాంత్, ఎంపీడీవో జ్యోతి, పీఆర్ ఏఈ రామారావు, ఇన్‌చార్జి ఆర్ఐ రాము, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులలో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ జి.బి. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ కాలనీ, పెద్దకాలువ తదితర ప్రాంతాలలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

కైకలూరు: పల్లెవాడ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం చెప్పారు. పల్లెవాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గృహాలు, పరిశ్రమలు, ఆక్వా, వాణిజ్య వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్

ముదినేపల్లి రూరల్: స్థానిక పోలీస్ స్టేషన్ రోడ్డులో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం నిర్వహిస్తామని ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

మురుగునీటిని రోడ్లపైకి వదలొద్దు


ముదినేపల్లి రూరల్: మురుగునీటిని రోడ్లపైకి వదిలి ప్రజలకు అసౌకర్యం కల్పించొద్దని పెనుమల్లి కార్యదర్శి హారిక అన్నారు. మండలంలోని పెనుమల్లి శివారు సింగారంలో రోడ్లపైకి మురుగు నీరు యథేచ్ఛగా వదిలి అసౌకర్యం కలిగిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై స్పందించిన కార్యదర్శి గ్రామంలో మురుగునీరు పోయేందుకు కచ్చా డ్రెయిన్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశామని, అప్పటి వరకు ఎలాంటి అసౌకర్యం కల్పించవద్దని కోరారు.

మొక్కలు నాటిన నేతలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని దేవపూడిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ జయమంగళ ప్రారంభించారు. దివంగత మాజీ సర్పంచి దాసరి గోపాలకృష్ణ జ్ఞాపకార్థం ఆయన మనవడు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి కాశీ అన్నపూర్ణ, పాండురంగ విఠల్, గుజ్జల రమేష్, వీరంకి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ ఇవ్వాలి

తోట్లవల్లూరు: వ్యవసాయానికి తొమ్మిది గంటలపాటు విద్యుత్‌ను సరఫరా చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై మండలంలోని రొయ్యూరు శివారు తోడేళ్లదిబ్బలంక రైతులు ట్రాన్స్‌కో ఏఈఈ దేవదాసును శుక్రవారం సాయంత్రం కలిసి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్ సరఫరాను ఏడు గంటలకు కుదించటం వలన పంటల సాగుకు ఇబ్బందిగా మారిందని రైతులు పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో సంభవించిన కృష్ణానది వరదల కారణంగా పంటలన్నీ దెబ్బతిన్నాయని, ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా మొక్కజొన్న, పసుపు, మినుము పంటలను సాగు చేస్తున్నామని వివరించారు. ఎప్పటిలాగే వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్‌ను అందించి ఆదుకోవాలని, లేదంటే పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. జనసేన మండల కార్యదర్శి గంగిశెట్టి సత్యన్నారాయణ, రైతులు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎం. శివకృష్ణ, పసుపులేటి శ్రీనివాసరావు, జి.నాంచారయ్య, రావి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


ఏఈఈ దేవదాసుకి వినతిపత్రం అందిస్తున్న రైతులు

నందేటికి మాజీ ఎమ్మెల్యే కైలే పరామర్శ

తోట్లవల్లూరు: ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని పెనమకూరులో అనారోగ్యంతో బాధపడుతున్న నందేటి సోమేశ్వరరావును శుక్రవారం రాత్రి ఆయన పరామర్శించారు. అనారోగ్య కారణాలను తెలుసుకోవటంతోపాటు ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలా అండగా ఉంటామని అనిల్‌కుమార్ భరోసా ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ నందేటి గంగాభవాని, సీడీసీ మాజీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, పార్టీ నాయకులు చింతలపూడి గవాస్కర్‌రాజు, గారపాటి నాని, ఎంపీటీసీ సభ్యుడు మరీదు మధుబాబు పాల్గొన్నారు.


సోమేశ్వరరావును పరామర్శిస్తున్న కైలే అనిల్‌కుమార్

ఏసు క్రీస్తు మార్గం అనుసరణీయం

అడ్డాడ(పామర్రు): ఏసుక్రీస్తు చూపిన సేవా మార్గంలో ప్రతి ఒక్కరూ పయనిస్తూ ఆయన బోధనలను అనుసరించాలని దైవజనులు క్రీస్తు రాయబారి పేర్కొన్నారు. మండల పరిధిలోని అడ్డాడ గ్రామంలో శిలువ మిషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న 'శిలువ పండుగ' కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి అనేక మంది క్రీస్తు విశ్వాసులు పాల్గొని సాక్ష్యాలను ఇచ్చారు. ఈ సందర్భంగా క్రీస్తు రాయబారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతి, క్షమ, దయ గుణాలను కలిగి ఉంటూ సమాజంలో శాంతి స్థాపనకు కృషి చేయాలన్నారు. దైవజనురాలు లూధియానా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆలపించిన భక్తి పాటలు విశ్వాసులను ఆనందపరిచాయి. కార్యక్రమంలో పాస్టర్లు ప్రభు, మిల్కిషుద్రక్ (రామకృష్ణ), అకుల్లా (ప్రసాద్), సత్యం, విజయ్‌శేఖర్, అబ్రహం తదితర పాస్టర్లు, క్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దైవజనులు క్రీస్తు రాయబారి, పక్కన లూధియానాఅమ్మ

'దండోరా పిలుస్తోంది' బ్రోచర్ల ఆవిష్కరణ

గుడ్లవల్లేరు: ఎస్సీ వర్గీకరణ కొరకు గుడివాడ నియోజకవర్గ మాదిగ, ఉప కులాల ఆత్మీయ సమ్మేళనాన్ని 'దండోరా పిలుస్తోంది' పేరిట నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల సుధాకర్ అన్నారు. ఈ కార్యక్రమ బ్రోచర్లను శుక్రవారం గుడ్లవల్లేరు అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆవిష్కరించారు. అంగలూరు కవిరాజునగర్‌లో ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చిలుముల రాధాకృష్ణ, జుజ్జువరపు ప్రశాంతి, చాట్ల అర్జున్, కోలవెంటి రవిబాబు, కొమ్ముల పేరయ్య, అద్దంకి మాణిక్యాలరావు, గంధం సైమన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

అన్నసమారాధన

గుడివాడ టౌన్: స్థానిక కోదండ రామాలయం ప్రాంగణంలో శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత వేదమంత్రోచ్ఛరణల మధ్య అన్నప్రసాదాలను స్వామి వారికి అంకితం చేసి అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహక కమిటీ అధ్యక్షుడు డొక్కు రాంబాబు మాట్లాడుతూ గత 80 సంవత్సరాలుగా శ్రీ కోదండ రామాలయం వద్ద ధనుర్మాస మహోత్సవాలు అత్యంత వైభవంగా తమ పూర్వీకులు నిర్వహించేవారన్నారు. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ మహోత్సవాలు ఘనంగా నిర్వహించామన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, కడియాల గణేష్, గుత్తా చంటి, సయ్యద్ గఫార్, దారపరెడ్డి వెంకన్న, ఎం.రామకృష్ణ, ఆర్.రాజేంద్రప్రసాదు, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.


అన్నసమారాధన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

చికిత్స పొందుతూ యువకుడు మృతి

తోట్లవల్లూరు: కోడిపందేల కోసం వస్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ ఎం. అర్జునరాజు శుక్రవారం తెలియజేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మహానాడు ప్రాంతానికి చెందిన సమన్ సాగర్ (22) తన స్నేహితుడు మధుసూదన్ రెడ్డితో కలిసి ఈ నెల 15న సాయంత్రం కోడిపందేలు చూసేందుకు కంకిపాడు మండలం గొడవర్రు వెళుతున్నాడు. మార్గమధ్యలో మండలంలోని రొయ్యూరు సమీపంలో బైక్ అదుపు తప్పి సమన్ సాగర్ తీవ్రంగా గాయపడ్డాడు. మధుసూదన్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సమన్ సాగర్ మృతి చెందినట్లు ఎస్ఐ అర్జునరాజు తెలియజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం

ఉరుటూరు (పామర్రు): ఓ పెంకుటిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైన సంఘటన ఉరుటూరులో శుక్రవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నర్రా రామకృష్ణకు చెందిన పెంకుటింటిలో బొగ్గరపు గురునాథం నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పులు చెలరేగాయి. ఈ నిప్పులు ఇంట్లో పడక గదిలో ఉన్న పరుపుపై పడటంతో మంటలు అంటుకుని ఇల్లంతా వ్యాపించాయి. దీంతో ఇంట్లో ఉన్న గృహోపకరణాలు బయటకు తెచ్చే సమయం లేక పోవడంతో అన్ని అగ్నికి ఆహుతయ్యాయి. పామర్రు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ సంఘటనలో సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక అధికారి రాంబాబు తెలిపారు.

60 మంది ఎస్టీలకు దుప్పట్ల పంపిణీ

నాగాయలంక: మండల శ్రీకృష్ణ దేవరాయ శ్రీకనకదుర్గమ్మ కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణ దేవరాయ జయంతి పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నాగాయలంక మండలం పర్రచివర, దిండి గ్రామాల్లో గుర్తించిన 60మంది గిరిజన యానాదులకు చలికాలం నేపథ్యంలో రూ.10 వేల విలువైన దుప్పట్లు అందజేశారు. సంఘం అధ్యక్షుడు భోగాది సోమశేఖర్(చిన్నారి) సౌజన్యంతో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, గణపేశ్వరం ఎంపీటీసీ సభ్యుడు బర్మా శ్రీనివాసరావు, నీటిసంఘం అధ్యక్షుడు కారంకి కృష్ణ పంపిణీ చేశారు. మండలి బాజీ, విజయ్, కారంకి ప్రసాద్, గంగయ్య, పులి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.


ఎస్టీలకు దుప్పట్లు అందించిన సోమశేఖర్, తోట తదితరులు

క్లుప్తంగా

ఘనంగా చర్చి మూడో వార్షికోత్సవం



పెదమద్దాలి(పామర్రు): గ్రామంలోని కల్వరి బాప్టిస్ట్ సంఘం మూడో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈవీఎఫ్ కౌన్సిల్ ఎన్.నోతన బాబు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభువు సేవతో పాటు పాస్టర్లు సమాజ సేవలలో కూడా పాల్గొనాలని అన్నారు. పాస్టర్లు సంఘటితంగా ఉన్నప్పుడు మాత్రమే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.యేసు దాసు మాట్లాడుతూ సంఘాలు అభివృద్ధి చెందాలంటే అందరం కలిసి కట్టుగా ఉండాలని కోరారు. అనంతరం అందరికీ ప్రేమ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీఎల్ జాన్సన్, పాస్టర్లు కె.రవికుమార్, కె.కమలేషన్‌లు పాల్గొన్నారు.

మళ్లీ సంక్రాంతికి వస్తాం




గుడ్లవల్లేరు: సంక్రాంతికి సందడి చేసిన గంగిరెద్దుల కళాకారులు అందరికీ ఆనందాన్ని పంచిపెట్టారు. సంక్రాంతి నెల ముగియడంతో ఇక ఆ సందడికి స్వస్తి చెప్పేసి గమ్యస్థానాలు చేరుకునేందుకు ఇంటి ముఖం పట్టారు. నెల గంట పట్టాక సంక్రాంతి తర్వాత కనుమ, ముక్కనుమ వరకు గ్రామాల్లో సందడి చేసిన డూడూ బసవన్నలను వ్యానులపై తమ గమ్య స్థానాలకు యజమానులు తరలించారు.

ఘనంగా లక్ష్మీగణపతి హోమం




గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ లక్ష్మీ గణపతి హోమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 90 మంది ఉభయదాతలు పాల్గొని ఈ పూజా కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ ఈఓ వై.శ్రీనివాసరావు తెలిపారు. లోక కల్యాణార్థం సమాజ సంక్షేమం కోరుతూ విఘ్నేశ్వర స్వామి కటాక్షం పొందేందుకు ఈ హోమం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మల్లాది గణేష్ శర్మ, కపిలవాయి గోపాలశాస్త్రి, అశోక్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



గుడివాడ టౌన్: శివ ఇంటీరియర్స్ నూతన సంవత్సర 2025 క్యాలెండర్‌ను వన్‌టౌన్, టూటౌన్ సీఐలు కె.శ్రీనివాసరావు, సీహెచ్. నాగప్రసాద్ శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో శివ ఇంటీరియర్స్ అధినేత ఎం.శివ, యాదవ సేవా సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్, కె.అజయ్ కుమార్, జె.మునీంద్ర, జి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు



కనుమూరు(పామర్రు): విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిలోని కనుమూరు గ్రామం వద్ద రోడ్డు ప్రమాదం శుక్రవారం జరిగింది. బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. తన స్వగ్రామమైన కాకరంపాడు నుంచి అమరావతికి క్యాబినెట్ సమావేశానికి హాజర య్యేందుకు రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అదే జాతీయ రహదారిపై వెళ్తున్నారు. కనుమూరు గ్రామం వద్ద రోడ్డు పక్కనే క్షతగాత్రులై పడిఉన్న ఇరువురిని చూచిన మంత్రి తన కాన్వాయ్‌ను ఆపారు. వారి పరిస్థితిని గమనించి దగ్గరలో ఉన్న ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. అదే కాన్వాయ్‌లో ఇద్దరినీ ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత మంత్రి క్యాబినెట్ సమావేశాలకు వెళ్లారు.